క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ముమ్మిడివరం: గ్రామంలోని పెద్ద వంతెన సమీపంలో ఉన్న శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూరగాయల వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



దేవగుప్తంలో శివపార్వతుల కల్యాణ నిర్వహిస్తున్న పండితులు

అల్లవరం: దేవగుప్తం గ్రామంలో ఉన్న ఉమాపార్వతి సమేత మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో వైశాఖమాసం ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ పురోహితులు చంద్రమౌళి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల వార్షిక కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవగుప్తం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారి కళ్యాణాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అల్లవరంలో ప్రముఖ వ్యాపార వేత్త బండిగుప్తావు పాండురంగ ఆధ్వర్యంలో భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారధన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

ముమ్మిడివరం: కమిని పంచాయతీ పరిధి సలాదివారిపాలెంలో గౌతమి నదీతీరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామమాజీ సర్పంచ్ గెద్దం శేఖర్ దంపతులు ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈపూజా కార్యక్రమంలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, దంపతులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఏజీపీగా సిద్ధార్థకుమార్

ముమ్మిడివరం: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీగా కాశి సిద్ధార్థకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేసింది. తనను ఏజీపీగా నియమించిన ప్రభుత్వానికి సహకరించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

20న పారిశుధ్య కార్మికుల సమ్మె



మున్సిపల్ కమిషనర్ రాజుకు సమ్మె నోటీసును అందజేస్తున్న యూనియన్ సభ్యులు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు పలు సమస్యల సాధన కోసం ఈనెల 20వ తేదీన ఒక రోజు సమ్మెను చేపడుతున్నట్టు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల బాబి, జిల్లా కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావులు కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుకు వివరించారు. సఫారీ కర్మచారి జాతీయ సంఘం పిలుపు మేరకు ఈ సమ్మె చేపడుతున్నట్టు20న పారిశుధ్య కార్మికుల సమ్మె ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈనెల 20న చేపట్టబోయే ఒక రోజు సమ్మెకు సంబంధించిన నోటీసును కొప్పుల బాబి, నిమ్మకాయల శ్రీనివాసరావు తదితరులు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజుకు గురువారం సాయంత్రం అందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాళ్లరేవు: చెట్ల కటింగ్ కారణంగా తాళ్లరేవు సబ్ స్టేషన్‌లో 11 కేవీ గాడిమొగ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ గ్రామాలు గాడిమొగ, చినవలసల, పెదవలసల, లక్ష్మీపతిపురం విద్యుత్ ఉండదని తెలిపారు.

లోవోల్టేజీతో సతమతం

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఇబ్బంది పెడుతున్న లోవోల్టేజీ, కోతల సమస్య
- విద్యుత్ కెపాసిటీ పెంచినా తప్పని తిప్పలు
- సమస్యను పరిష్కరించాలని వినియోగదారుల మొర



కాట్రేనికోన సబ్ స్టేషన్‌లో 8 మెగావాట్స్ కెపాసిటీ పీటీఆర్‌లు

కాట్రేనికోన: విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత, లోవోల్టేజి సమస్యలతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో చెయ్యేరు, కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్‌లో పరిధిలో లోవోల్టేజీ సమస్యలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో వరుస కథనాలతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు 8 పీటీఆర్ కెపాసిటీకి పెంచి 5 పీటీఆర్ విద్యుత్‌ను మాత్రమే సరఫరా చేస్తున్నారు. పవర్ ట్రాన్స్ ఫార్మర్(పీటీఆర్) కెపాసిటీ పెంచినా లోవోల్టేజీ సమస్య మాత్రం తీరలేదు. వేసవి ఎండలకు తోడు కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యలతో వినియోగదారులు సతమతమవుతున్నారు. రొయ్యలు, చేపలు చెరువులతో పాటు ఏసీలు వాడకం మరింత పెరిగింది. పీటీఆర్‌లు కెపాసిటీ అవసరమైనంత ఉన్నా వినియోగదారులకు విద్యుత్‌ను సరఫరా చేయడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు.

సమస్య పరిష్కారం కోసం..

మూడేళ్ల క్రితం కొత్త సబ్‌స్టేషన్ పనులు చేపట్టేందుకు నిధులు సమకూర్చినా స్థలం దాతలు ఇవ్వకపోవడంతో పనులు చేపట్టలేదు. ఇటీవల పల్లంకుర్రులో సబ్ స్టేషన్ పనులకు శ్రీకారం చుట్టారు. కాట్రేనికోన మండలంలో చెయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 8 మెగావాట్స్ కెపాసిటీ పీటీఆర్‌లు రెండు, కాట్రేనికోనలో 8 మెగావాట్స్ కెపాసిటీ పీటీఆర్ ఒకటి, 5 పీటీఆర్ ఒకటి ఉన్నాయి. అయితే కొత్తగా ఏర్పాటు చేసిన 8 పీటీఆర్‌లు 5 పీటీఆర్ కెపాసిటీలోనే ఉంచి సరఫరా చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ఎండలకు అధిక ఉష్ణోగ్రతలతో లోవోల్టేజి సమస్యలకు వినియోగదారులతో పాటు రొయ్యలు, చేపలు చెరువులు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బల్బులు మినుకు మినుకు మంటున్నాయని, ఫ్యానులు అసలు తిరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని విద్యుత్ కోతలు

వేసవి ఉష్ణోగ్రతలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న వినియోగదారులకు వేళపాల లేకుండా విద్యుత్ కోతలు తప్పడంలేదు. ఆరు నెలల క్రితం కాట్రేనికోన ఏఈ బి.నాగేశ్వరరావు బదిలీపై వెళ్లిపోవడంతో సబ్ ఇంజినీరు ఇన్‌చార్జిగా ఏఈగా బాధ్యతలు చూస్తున్నారు. పర్మినెంటు ఏఈ లేకపోవడంతో విద్యుత్ సమస్యలపై ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యుత్ సిబ్బంది మండల కేంద్రాలలో అందుబాటులో లేకపోవడంతో ఈదురు గాలులకు విద్యుత్ సమస్యలు వస్తే స్పందించే సిబ్బంది లేరు. మండల శివారు ప్రాంతాల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఫ్యాన్లు పాడైపోతున్నాయి

లోవోల్టేజితో ఫ్యాన్లు తిరగడం లేదు, బల్బులు సక్రమంగా వెలగడం లేదు ఫ్రిడ్జిలు, ఫ్యానులు పాడైపోతున్నాయి. ఎండలకు అధిక ఉష్ణోగ్రతలతో ఫ్యానులు తిరగక ఉండలేకపోతున్నాం. విద్యుత్ కోతలుతోపాటు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించండి.

– మల్లాడి బాబ్జి, సర్పంచి, పల్లం

ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతాం

లోవోల్టేజీ సమస్యపై నా దృష్టికి వచ్చింది. లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుని వెళతాం. పీటీఆర్‌లు కొత్తగా వేసినందున పవర్ పెంచాల్సి ఉంది. దానికి చర్యలు

–ఎం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి, ఏఈ, కాట్రేనికోన

క్యూబాకు సంఘీభావంగా విరాళాల సేకరణ



అమలాపురంలో విరాళాలను సేకరిస్తున్న జిల్లా ఐద్వా నాయకురాళ్లు

అమలాపురం టౌన్: అమెరికా ఆంక్షలకు బలవుతున్న క్యూబాకు సంఘీభావం తెలుపుతూ విరివిగా విరాళాలు, ఆహారాన్ని అందించాలని జిల్లా ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు ఎండీ అమీదు నీషా, టి.నాగవరలక్ష్మి పిలుపునిచ్చారు. ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఫండ్ క్యాంపెయిన్‌లో భాగంగా అమలాపురం పట్టణంలో ఆ సంస్థకు చెందిన మహిళలు గురువారం సాయంత్రం విరాళాలు సేకరించారు. పట్టణంలోని ప్రతీ దుకాణానికి, కొన్ని ఇళ్లకు వెళ్లి విరాళాలు సేకరించారు. ఐద్వా నాయకురాళ్లు ఎ.రత్నకుమారి, సీహెచ్. రామలక్ష్మి తదితరులు ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విరాళాల సేకరణ వారం రోజులపాటు కొనసాగుతుందని, చివరిగా వచ్చిన మొత్తాన్ని డీడీ తీసి క్యూబాకు పంపిస్తామని ఐద్వా జిల్లా కార్యదర్శి నాగ వరలక్ష్మి తెలిపారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- డీఎల్ఏటీ జిల్లా అధికారి డాక్టర్ భరతలక్ష్మి పిలుపు
- అమలాపురంలో తలసీమియా దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎల్ఏటీ జిల్లా అధికారి డాక్టర్ భరతలక్ష్మి, వైద్యులు, సిబ్బంది

అమలాపురం టౌన్: జిల్లాలో తలసీమియా రోగులకు అత్యసవరంగా రక్తం అందించేందుకు అవరోధం ఏర్పడుతోందని, దాతలు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా లెప్రసీ అండ్ ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి అన్నారు. తలసీమియా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. రక్తం కోసం అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రక్తదానం చేస్తే ఉభయ ప్రయోజనాలు ఉంటాయని డాక్టర్ భరతలక్ష్మి తెలిపారు. ఆపత్కర సమయంలో రోగి ప్రాణం నిలబెట్టినట్లు ఉంటుందని చెబుతూ రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు ఆమె వివరించారు. ర్యాలీ ఏరియా ఆస్పత్రి నుంచి నల్లవంతెన వరకూ చైతన్య పూరితంగా సాగింది. ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ అనూష, డైస్ మెడికల్ ఆఫీసర్ జాన్ లెవీ, డాక్టర్ గీత, ఏరియా ఆస్పత్రి బ్లబ్ బ్యాంక్ మేనేజర్ దొడ్డా కాశీ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీమియం లీగ్ క్రికెట్ విజేత వీరవల్లిపాలెం జట్టు



క్రికెట్ విన్నర్ విజేత వీరవల్లిపాలెం జట్టుకు నగదు బహుమతిని అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి, గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రమణారావు తదితరులు

అమలాపురం టౌన్: పట్టణం సావరంలో గత పది రోజులుగా జరుగుతున్న ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఎస్‌పీఎల్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఉత్కంఠగా జరిగిన ఈ పోటీల్లో విన్నర్‌గా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం జట్టు విజేతగా నిలిచి రూ.20 వేల నగదు బహుమతిని కైవసం చేసుకుంది. అలాగే రన్నర్‌గా పి.గన్నవరం మండలం ముంగండ జట్టు గెలిచి రూ.10 వేల నగదు బహుమతిని సాధించింది. ఈ పది రోజులు టోర్నమెంట్‌లో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మొత్తం 30 క్రికెట్లు జట్టు పాల్గొని 46 మ్యాచ్‌లు ఆడాయి. విజేత జట్లకు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే వెంకట రమణారావు, పార్టీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు తదితరలు నగదు బహుమతులు అందజేశారు. విన్నర్ టీమ్‌కు ఇచ్చిన రూ.20 వేల నగదు బహుమతిని కుంచే వెంకటరమణారావు సమకూర్చిన సంగతి తెలిసిందే. పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, పార్టీ మండల యువజన కమిటీ అధ్యక్షుడు కేతా భాను తేజ, ముషిణి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక నవీన్ మొబైల్స్ వారు మొత్తం టోర్నమెంట్‌కు స్పాన్సర్స్‌గా వ్యవహరించారు.


ఇద్దరి అరెస్టు

అమలాపురం రూరల్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆ శాఖ సీఐ తన సిబ్బందితో మండలంలో దాడులు నిర్వహించారు. బోడసకుర్రు గ్రామంలో బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న శివనాగ సూర్యనారాయణ నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు. కామనగరువులో సారా విక్రయాలు జరుపుతూ రెండోసారి పట్టుబడిన దాసరి వెంకటరమణ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. వెంకటరమణను తహసీల్దార్ కోర్టులో హాజరు పరచడంతో రూ.15000 జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

జిల్లా సమైక్య ఆడిటర్లు కావాలి

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వెలుగు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల సమాఖ్య సంస్థలను 2024–2025 ఆర్థిక సంవత్సరానికి ఆడిట్ చేయడానికి ఆడిటర్లు కావాలని జిల్లా సమైక్య అధ్యక్షురాలు వై.సత్యారాణి గురువారం ఒక ప్రకటనలో కోరారు. సెర్ప్ మార్గ నిర్దేశాలను అనుసరించి జిల్లాలో గ్రామైక్య సంఘాలు, మండల మహిళా సమాఖ్యలు, జిల్లా సమాఖ్య, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను స్టాట్యూటరీ ఆడిట్ చేయాల్సి ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు 8074217146 నంబర్‌ను సంప్రదించవచ్చు.

వైభవంగా వెంకన్న తీర్థం



అంబాజీపేట: సిరి భూ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్థానిక కొర్లపాటి వారిపాలెంలో గురువారం నిర్వహించిన తీర్థం వైభవంగా సాగింది. ఏడు వారాల వెంకన్నబాబును దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తుల సహకారంతో భారీ అన్న సమారాధన జరిగింది. స్వామివారిని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ దర్శించుకున్నారు.

ఇసుక నిల్వలను పరిశీలించిన కలెక్టర్

అమలాపురం రూరల్: వర్షాకాలంలో భవన నిర్మాణ రంగ కార్మికుల ఉపాధికి, నిర్మాణ రంగం కొనసాగేందుకు అవసరమైన ఇసుక నిల్వలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రెవెన్యూ భూగర్భ గనులశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని కామనగరువు బైపాస్‌రోడ్డులో ఇసుక స్టాక్ యార్డ్, రావులపాలెం మండలం రావులపాడు కూరేటి వారి చెరువు వద్ద, ఇసుక స్టాక్ యార్డ్, జొన్నాడ జాతీయ రహదారి పక్కన ఉన్న ఇసుక స్టాక్‌యార్డ్‌ను అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో భవన నిర్మాణ రంగాన్ని కార్మికుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అవసరమైన ఇసుక నిల్వలు ఉంచాలని సూచించారు. స్టాక్ యార్డులో ప్రవేశ, వచ్చే మార్గాలు స్పష్టంగా ఉండాలన్నారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయాలు ఉండకూడదన్నారు. వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థ ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించడంతో పాటు పర్యావరణానికి హాని కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక తరలింపులో వాహనాలపై రహదారి భద్రత దృష్ట్యా టార్పాలిన్ కప్పాలన్నారు. సీసీ కెమెరాలు నిఘాలో ఇసుక కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ ట్రాకింగ్ విధానం ఉండాలన్నారు. ఇసుక ఆన్లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్ రవాణా రికార్డుల నిర్వహణ అంశాలను అత్యంత పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, జిల్లా భూగర్భ గనుల శాఖ సహాయ సంచాలకులు వంశీధర్ రెడ్డి, తహసీల్దార్లు పలివెల అశోక్ ప్రసాద్, ముక్తేశ్వరరావు, సర్వేయర్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీ



అమలాపురం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ వీరబాబు, ఎస్సై కిషోర్‌బాబు

అమలాపురం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో పట్టణ పోలీసులు యాంటీ సబటేజ్ చెక్ పేరుతో గురువారం పలు తనిఖీ నిర్వహించారు. పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్సై ఎస్ఆర్ కిశోర్‌బాబు, పోలీసు సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేశారు. బస్టాండ్‌లోనే కాకుండా ఆ ప్రాంగణంలో ఉన్న పార్శిల్ సర్వీస్ (ఆర్టీసీ కార్గో)ను కూడా పరిశీలించారు. బాంబ్ డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లతో అనుమానం వచ్చిన చోటల్లా తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలతో ఎక్కడైనా ఏదైనా దాడులు, పేలుడు పదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగేందుకు అవకాశం ఉన్న అంశాలపై ఈ తనిఖీలు చేశారు. అగంతకులు, అపరిచిత వ్యక్తులు, విదేశీ కుట్రదారులు చొరబాటు తదితర అంశాలపై పోలీసులు ఆరా తీసి విచారించారు. ఆ దిశగా దృష్టిపెట్టి ముందు జాగ్రత్త చర్యగా ఈ తనిఖీలు చేపట్టారు. బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు రావడంతో ప్రజలు ఎక్కడైనా ఏదైనా జరిగిందోమోనని ఆందోళన చెందారు. అయితే సాధారణ తనిఖీల్లో భాగంగా చేసినట్టు తెలిసి ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి



కోరంగి వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమంలో పాల్గొన్న వాసవీక్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: వాసవీమాత జయంతి వేడుకలు తాళ్లరేవులో ఘనంగా నిర్వహించినట్టు తాళ్లరేవు వాసవీ క్లబ్ కపుల్స్ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వాసవీమాత ఆలయం నుంచి నగర సంకీర్తన చేశారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు పారాయణం చేసి చీర సారె సమర్పించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు చేతుల మీదుగా కోరంగి ఆశ్రమంలో వృద్ధులకు బియ్యం, కూరలు, దుస్తులు అందజేశారు. అద్దేపల్లి తాతాజీ చేయించిన వెండి రుద్రాక్షమాలను కాలభైరవస్వామి ఆలయంలో అందజేశారు. అలాగే వాసవీమాత ఆలయానికి దాతలు ఇచ్చిన ఏసీని ప్రారంభించారు. అనంతరం రథోత్సవం, ఊంజల్‌సేవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కంచర్ల సత్యనారాయణ, పేకేటి సతీష్, అద్దేపల్లి సత్తిరాజు, కూర్మదాసు భారతి, చెక్కా సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ పరిస్థితులపై ప్రజలకు అవగాహన



సుంకరపాలెంలో అవగాహన సదస్సు

తాళ్లరేవు: భారత–పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో ప్రజలు చేపట్టాల్సిన అంశాలపై అధికారులు గురువారం అవగాహన కల్పించారు. సుంకరపాలెం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వలీబాబా మాట్లాడుతూ భారత–పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యుద్ధానికి సంబంధించి సైరన్ మోగితే ప్రజలు తమ ఇళ్లలో దీపాలను ఆర్పివేసి నేలపై పడుకుని సురక్షితంగా ఉండాలని సూచించారు. యుద్ధ సమయంలో ఏ విధంగా ప్రవర్తించాలి అనే అంశంపై మాక్ డ్రిల్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోపూరి వెంకటేశ్వరరావు, గుత్తుల శ్రీను, చిక్కం హనుమంతరావు, తాతపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోరంగి పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజెవి రమణ, నాయకులు టి.లక్ష్మణరావు, పి.రామలక్ష్మి, పెయ్యల శ్రీను, కె.దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు సంఘీభావం

అమలాపురం రూరల్: అమలాపురంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గురువారం కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించి సైనికులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు మమత జ్యోతి మాట్లాడారు. జిల్లావర్కింగ్ అధ్యక్షుడు ఎ.సాయి శంకర్, జిల్లా కార్యదర్శి, కె.సాయి తేజ, బీశివ, టీ.మనోహర్, జల్లి.వెంకటేష్ , సుమంత్.రాజీవ్.జిల్లా ఉపాధ్యక్షుడు టీ.రంగారావు, శ్రీ రామ్, హిమజ పాల్గొన్నారు.

16న పట్టుకున్న వాహనాల వేలం

అమలాపురం టౌన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుకున్న రెండు వాహనాలకు ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్, కార్యాయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్నట్టు సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. రెండు కేసుల్లో పట్టుబడ్డ రెండు కార్లకు నిబంధనలకు లోబడి వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే ప్రతి పాటదారుడు రూ.రెండు వేలు ధరావత్తు చెల్లించాలని సూచించారు. వేలంలో పాల్గొనే పాటదారులు ఇతర వివరాలకు ఎక్సైజ్ ఎస్సై 9676482024 నంబర్‌ను సంప్రదించాలని సీఐ సత్యనారాయణ సూచించారు. పట్టుకున్న రెండు కార్లకు సంబంధించి ఒకటి రూ.60 వేలు, మరో కారుకు రూ.75 వేలు చొప్పున అప్‌సెట్ ప్రైస్‌ను ఆర్డీవో నిర్ణయించారని తెలిపారు.

కన్నుల పండువగా స్వామివార్ల కల్యాణం

- ర్యాలిలో ఉమా కమండలేశ్వర స్వామి కల్యాణం
- ఘనంగా రమా సత్యనారాయణస్వామి కల్యాణ వేడుక



ర్యాలిలో ఉమా కమండలేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



రమా సత్యనారాయణ స్వామివారి కల్యాణ వేడుక

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి గ్రామంలోని ఉమా కమండలేశ్వరస్వామి, జగన్మోహినీ కేశవ స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న రమా సత్యనారాయణ స్వామివార్ల దివ్య కల్యాణ మహోత్సవాలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ఆయా దేవస్థానాల కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఉదయం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారులు, పెళ్లి కుమార్తెలుగా ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు, అనంతరం రాత్రి 7 గంటలకు రమా సత్యనారాయణ స్వామివార్లకు, ఉమా కమండలేశ్వర స్వామివార్లకు కల్యాణం నిర్వహించారు. దేవస్థానం తరఫున ఈఓ రమణమూర్తి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రదానం కార్యక్రమం నుంచి తలంబ్రాల కార్యక్రమం వరకూ ప్రతి కల్యాణ క్రతువును వేద పండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే వ్యాఖ్యాన పండితులు ప్రతి ఘట్టాన్ని కళ్లకు కట్టినట్టు వివరించారు. ఈ కల్యాణ మహోత్సవాలకు ర్యాలి, పరిసర గ్రామాల వారితో పాటు, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో రమణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది, స్థానికులు ఏర్పాట్లు చేశారు.

ప్రతిష్టాత్మకంగా సారా నిర్మూలన

- 67 మందిపై సారా, 22 మందిపై అక్రమ మద్యం కేసులు
- ఎక్సైజ్ సీఐ కాత్యాయని



కొత్తపేట: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సారా నిర్మూలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి, సత్ఫలితాలు సాధిస్తున్నామని ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, సారా సంపూర్ణ నిర్మూలన లక్ష్యంతో నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా సారా ప్రభావిత గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు, కళాజాతాల ద్వారా, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సారా వల్ల అనర్థాలు, అనారోగ్య పరిస్థితులపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. సారా తయారీ, విక్రయాలు సాగించే వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పటి వరకు ఐదు దశల్లో 67 మందిపై కేసులు నమోదు చేసి, 414 లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నామన్నారు. 38 వేల లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. అలాగే 22 మందిపై అక్రమ మద్యం కేసులు నమోదు చేసి, 45.62 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితుల్లో 61 మందిని బైండోవర్ చేశామన్నారు. సారాపై ఎటువంటి సమాచారమైనా టోల్ ఫ్రీ నంబరు 14405కు లేదా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కొత్తపేట సర్కిల్ కార్యాలయం 94409 02423కు సమాచారం ఇవ్వాలని సీఐ కాత్యాయని కోరారు.